


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 30-12-2025 | సంపుటి - 24 | సంచిక -222 | రూ : 4 | పేజీలు: 8



శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు
ముఖ్యమంత్రి వర్యులు

## TELANGANA MEANS BUSINESS





తెలంగాణ ఇన్నోవేటివ్ హబ్



ప్రగతిబాటకు బావుటా హైదరాబాద్



మూసీ నదీ తీరానికి పునరుజ్జీవం



30 వేల ఎకరాల స్వయం సమృద్ధ ఫ్యూచర్ సిటీ



సముద్ర రవాణా కోసం డ్రై పోర్టులు



మెట్రో విస్తరణ మరియు బులెట్ ట్రైన్స్

దేశాభివృద్ధి ఇప్పుడు తెలంగాణలో తన వేగాన్ని చూసుకుని మురిసిపోతోంది. 2047 వరకు ఒక ప్రగతిశీల, బలమైన మార్గదర్శనం గల 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తున్న గ్రీన్ హౌస్ వాయువులు లేని రాష్ట్రంగా రూపాంతరం చెందుతుంది. సంస్కరణల పునాదుల ఆధారంగా, పారిశ్రామిక కేంద్రంగా మారుతూ, భారీస్థాయి పెట్టుబడులకు నిలయంగా నిలుస్తుంది.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ దీనినే ప్రతిఫలిస్తుంది. రెండేళ్ల సమర్థవంతమైన పాలన, విజన్ 2047 ద్వారా చక్కని భవిష్యత్తు ముఖచిత్రాన్ని ఆవిష్కరిస్తుంది.

జారీ చేసినవారు: సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

TELANGANA
RISING
CURE - PURE - RARE

# ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం..

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేసినట్లు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోని పలు జిల్లాల స్వరూపాన్ని మార్పులు, చేర్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయని వివరించారు. సమావేశం అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ, ప్రజాభీష్టం మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మార్పులు జరిగాయని, 9 జిల్లాలను యథాతథంగా కొనసాగించనున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం ప్రాంతాలను కలిపి ఒక మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. అలాగే, బనగానపల్లె, అడ్డరోడ్డును కొత్త రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేయనున్నారు. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉన్నప్పటికీ, జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తున్నట్లు ప్రకటించారు. పెనుగొండ పేరును 'వాసవీ పెనుగొండ'గా మార్చే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత, ప్రజాభిప్రాయం లేకుండా జిల్లాల విభజన చేపట్టిందని, దానివల్ల తలెత్తిన సమస్యలను ఇప్పుడు సరిదిద్దుతున్నామని మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ విమర్శించారు. పారదర్శకంగా వ్యవహరించి ఉంటే ఈ గందరగోళం ఉండేది కాదన్నారు. పోలవరం పరిసర ప్రాంతాలతో పాటు, రాయచోటిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అనగాని తెలిపారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలులో వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని, కొప్పర్తి, ఓర్వకల్లు వంటి ప్రాంతాలకు పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రహదారి నిర్మాణం జరుగుతోందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి పూర్తి సహకారం అందుతోందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలా కాకుండా, పథకాలకు మహనీయుల పేర్లు పెడుతున్నామని, ఈ అంశంపై కూడా క్యాబినెట్‌లో చర్చ జరిగిందని ఆయన పేర్కొన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పాటు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం, విశాఖపట్నంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు వంటి ఇతర కీలక నిర్ణయాలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ

## బంగ్లాదేశ్ ఎన్నికలు...
## రెండు చోట్ల నుంచి తారిఖ్ రెహ్మాన్ పోటీ

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) యాక్టింగ్ ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఢాకా 17, బోగ్రా 6 నియోజకవర్గాల నుంచి ఆయన బరిలో దిగుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. బోగ్రా 16 నియోజకవర్గానికి గతంలో తారిఖ్ రెహ్మాన్ తల్లి, మాజీ ప్రధాని ఖలీదా జియా ప్రాతినిధ్యం వహించారు. ఒకప్పుడు ఈ స్థానం బీఎన్‌పీకి కంచుకోటగా ఉండేది. అయితే, 2023లో జరిగిన ఉప ఎన్నికల్లో అవామీ లీగ్ నాయకుడు ఆషన్ రిపు ఇక్కడ విజయం సాధించారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుండటంతో తారిఖ్ రెహ్మాన్ తరఫున బీఎన్‌పీ నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. సుమారు 17 ఏళ్ల తర్వాత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఓటరు జాబితాలో ఆయన పేరును చేర్చేందుకు ఎన్నికల సంఘం అంగీకరించింది. కాగా, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ కార్యకలాపాలపై నిషేధం కొనసాగుతున్నందున, ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం కుదరదని తాత్కాలిక ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. షేక్ హసీనా గద్దె దిగినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో రాజకీయ

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు..

పాకిస్థాన్ : పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని వారాలుగా బలోచ్ వేర్పాటువాద సాయుధ గ్రూపులు జరిపిన వరుస దాడుల్లో కనీసం 15 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. ప్రావిన్స్‌లోని కెచ్, పంజ్‌గూర్, తుర్బాత్, సురబ్, నసీరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్), బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్జీ) అనే మూడు సంస్థలు ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు సోమవారం స్థానిక మీడియా వెల్లడించింది. డిసెంబర్ 23న కెచ్ జిల్లాలోని తేజాబన్ ప్రాంతంలో పాక్ ఆర్మీ పోస్టుపై తమ ఫైటర్లు దాడి చేసి ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయంద్ బలోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమేటిక్ ఆయుధాలు, గ్రెనేడ్ లాంచర్లతో ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 25న చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) మార్గంలో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రిమోట్ కంట్రోల్ బాంబును పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు చనిపోగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అలాగే, తుర్బాత్‌లో పాక్ సైన్యం వినియోగిస్తున్న కమ్యూనికేషన్ టవర్‌ను ఆదివారం పేల్చివేసినట్లు 'ది బలూచిస్థాన్ పోస్ట్' పేర్కొంది. మరోవైపు, డిసెంబర్ 27న సురబ్ జిల్లాలోని ఆర్‌సీడీ హైవేపై వాహనాలను అడ్డగించి, సైందక్ మైనింగ్ ప్రాజెక్టుకు చెందిన ట్రక్కులకు భద్రతగా వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ తెలిపారు. నసీరాబాద్ జిల్లాలో శనివారం రాత్రి పాక్ సైనిక కాన్వాయ్‌తో తమ ఫైటర్లకు గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్జీ) ప్రకటించింది. బలూచిస్థాన్ స్వాతంత్ర్యం వచ్చేవరకు ఇలాంటి దాడులు

## అసెంబ్లీలో కేసీఆర్ తో
## రేవంత్ రెడ్డి కరచాలనం..

హైదరాబాద్ :తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విపక్ష నేత హోదాలో అసెంబ్లీకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కరచాలనం చేశారు. సభలో కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి సీఎం రేవంత్ రెడ్డి వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనను పలకరించి అభివాదం చేశారు.

* **రెండు నిమిషాల తర్వాత వెళ్లిపోయిన కేసీఆర్**

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులు సంతాపం తెలిపారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. మాజీ సీఎం కేసీఆర్ ఈ రోజు సభలో ఉన్నది కేవలం రెండు నిమిషాలు మాత్రమే.

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను

హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తాను మాట్లాడిన విషయాలు మీకెలా చెబుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు అసెంబ్లీకి హాజరైన కేసీఆర్ కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు. శాసనసభ ప్రారంభం కాగానే రేవంత్ రెడ్డి, కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సభలో రెండు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఈరోజే కాకుండా, ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి ఆయన వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలని అన్నారు. మీరిద్దరు ఏం మాట్లాడుకున్నారని విలేకరులు ప్రశ్నించగా, తామిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతామని బదులిచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సభలో ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానం చెప్పేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని అన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ప్రాధాన్యత ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని సూచించారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## రైల్లో మంటలు.. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు స్పందన

అమరావతి : టాటానగర్‌ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే యలమంచిలి పోలీసులు, అగ్నిమాపక, రైల్వే, ఆర్‌పీఎఫ్ సిబ్బంది వేగంగా స్పందించి సమన్వయంతో పనిచేశారని ఆయన ప్రశంసించారు. వారి వృత్తి నైపుణ్యం వల్లే 150 మందికి పైగా ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారని అన్నారు. మంటలు వ్యాపించకుండా కోచ్‌లను వేరుచేయడం పెను ప్రమాదాన్ని నివారించిందని తెలిపారు. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం తెల్లవారుజామున అనకాపల్లి జిల్లా యలమంచిలి సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. టాటానగర్ నుంచి ఎర్నాకుళం వెళుతున్న ఎక్స్‌ప్రెస్ (18189) రైలులోని రెండు ఏసీ కోచ్‌లలో (బీ1, బీ2) ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బీ1 కోచ్‌లో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ (70) అనే వ్యక్తి మృతి చెందారు. లోకో పైలట్లు మంటలను గమనించి వెంటనే రైలును నిలిపివేయడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాదానికి గురైన రెండు కోచ్‌లను రైలు నుంచి వేరు చేసి, మిగతా రైలును సామర్లకోటకు పంపించారు. అక్కడి నుంచి ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ ప్రమాదం కారణంగా విశాఖపట్నం విజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘటనపై రైల్వే శాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరించి, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను అన్వేషిస్తున్నాయి.

## గ్రేటర్ హైదరాబాద్ లో
## ఈకేవైసీ చేసుకోకుంటే రేషన్ కట్

హైదరాబాద్ : రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని, దగ్గర్లోని రేషన్ షాపుకు వెళ్లి వేలిముద్రలు ఇవ్వాలని డీలర్లు సూచిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రతీ రేషన్ కార్డుదారుడు ఈ కేవైసీ చేయించుకోవాలని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నా రేషన్ కార్డుదారులలో స్పందన అంతంత మాత్రంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పలుమార్లు గడువు పొడిగిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ-కేవైసీ చేయించుకోని రేషన్ కార్డులకు సరుకులు ఆపేస్తారని ప్రచారం జరుగుతోంది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారితో పాటు పాత కార్డుల్లో కొత్తగా పేరు నమోదు చేయించుకున్న సభ్యులు తప్పకుండా ఈ-కేవైసీ చేయించుకోవాలని డీలర్లు చెబుతున్నారు. ఈ కేవైసీ చేసుకోని వారికి రేషన్ సరుకులు నిలిపివేస్తామని పౌరసరఫరాల శాఖ మౌఖిక ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వచ్చే నెల కోటా పూర్తయ్యేలోపైనా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



**ఈ- కేవైసీ ఎందుకంటే..**

రేషన్ కార్డు లబ్ధిదారుల్లో బినామీలు, బోగస్ కార్డులను గుర్తించేందుకే రేషన్ కార్డులో పేర్లు ఉన్న ప్రతీ సభ్యుడూ ఈకేవైసీ చేయించాలన్న నిబంధన అమలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. డూప్లికేట్ కార్డులు, చనిపోయిన యూనిట్ల ఏరివేత కార్యక్రమంలో భాగంగానే ఈ కేవైసీ చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ అప్డేట్ లేకపోవడం వల్ల బయోమెట్రిక్ లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ-కేవైసీతో ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు.

## వరల్డ్ ర్యాపిడ్ చెస్‌లో మెరిసిన తెలుగు తేజాలు..

ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన తెలుగు క్రీడాకారులు కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసిలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. సోమవారం నాడు ఎక్స్ వేదికగా ఆయన ఇద్దరు క్రీడాకారులను ప్రత్యేకంగా ప్రశంసించారు. కోనేరు హంపిని ఉద్దేశించి చంద్రబాబు స్పందిస్తూ, "ఒక్క ఫలితంతో ఛాంపియన్లను అంచనా వేయలేం. అత్యున్నత స్థాయిలో పదేపదే పోటీపడే ధైర్యమే వారిని నిలబెడుతుంది. ప్రపంచ వేదికపై కాంస్యం సాధించడం మీ నైపుణ్యానికి నిదర్శనం. మీ ప్రయాణం, నిలకడ దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది" అని పేర్కొన్నారు. అదేవిధంగా అర్జున్ ఎరిగైసిని కూడా ఆయన కొనియాడారు. "పురుషుల్లో గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారుడిగా అర్జున్ నిలిచారు. తెలంగాణ బిడ్డ అయిన అర్జున్, భారత చెస్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేర్చారు" అని చంద్రబాబు అన్నారు. మరోవైపు, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి వి. అనిత, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ ఎ. రవి నాయుడు కూడా హంపికి శుభాకాంక్షలు తెలిపారు. హంపి ఇప్పటికే ఈ ఛాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు సాధించిందని, ఆమె మహిళా క్రీడాకారులందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా అర్జున్‌ను అభినందించారు. తెలంగాణ గడ్డకు గర్వకారణంగా నిలిచిన అర్జున్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హంపిని కూడా అభినందించిన బండి సంజయ్, ఆమె దేశం గర్వపడేలా చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించం

హైదరాబాద్: ప్రజల ఆస్తులైన ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి మహ్మద్ అజారుద్దీన్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌లు.. పొంగులేటితో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పలుచోట్ల శ్మశాన వాటికలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రక్షణశాఖ, రెవెన్యూ, వక్ఫ్ బోర్డు సమన్వయంతో ఈ సమస్యను పరిష్కరించాలన్నారు. ఆక్రమణలను గుర్తించిన వెంటనే అధికారులు నోటీసులు జారీ చేసి... అవసరమైతే ఖాళీ చేయించి ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. వివాదాల్లో ఉన్న భూములను కాపాడేందుకు కలెక్టర్లు న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) ఉపాధ్యక్షుడు ఫహీం ఖురేషీ, రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, కలెక్టర్లు హరిచందన, మను చౌదరి తదితరులు పాల్గొన్నారు.

* **ప్రభుత్వ ప్రాథమ్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..**

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉద్దేశించిన ప్రభుత్వ ప్రాథమ్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రెవెన్యూ ఉద్యోగులపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## అన్ని ఆలయాల్లో 'శ్రీవారి సేవకులు' తరహా విధానం

రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో తిరుమల శ్రీవారి సేవకుల తరహాలో స్వచ్ఛంద సేవలను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందించాలని, భూ సర్వేల్లో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. సోమవారం నాడు అమరావతిలోని ఆర్టీజీఎస్ నుంచి రెవెన్యూ, వ్యవసాయం, వైద్యారోగ్యం, దేవదాయ సహా పలు కీలక శాఖల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా అందుతున్నాయనే దానిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో స్థానిక భక్తులతో వాలంటీర్లను నియమించుకోవాలి. భగవంతుడి సేవ చేసేందుకు చాలామంది ముందుకొస్తారు. అలాంటి వారిని ప్రోత్సహించి, వారి సేవలను వినియోగించుకోవాలి. ఇప్పటికే శ్రీశైలంలో ఈ విధానం కొనసాగుతోంది. ఇదే స్ఫూర్తితో అన్ని ఆలయాల్లో అమలు చేయాలి" అని దేవదాయ శాఖ అధికారులకు సూచించారు. ప్రజలకు నిత్యం అవసరమయ్యే రెవెన్యూ, వైద్యారోగ్య శాఖల పనితీరుపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. "ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, వేగంగా అందాలి. భూ సర్వేలు చేపట్టేటప్పుడు ప్రజలు ఇబ్బందులు పడకూడదు. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగంపై ఉన్న చెడ్డపేరును తొలగించుకునేలా పనిచేయాలి" అని ఆయన దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు అన్నిచోట్లా పరిశుభ్రత పాటిస్తూ, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వైద్యులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం వ్యవసాయ, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. "భూసార పరీక్షలు నిర్వహించి, ఎరువుల వాడకాన్ని తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ పంటలు పండించాలో తెలియజేయాలి. దీనికోసం క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిసి పనిచేయాలి" అని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని, మిల్లర్లు ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని రవాణా శాఖను ఆదేశించారు. అగ్నిమాపక శాఖ పనితీరు బాగుందని అభినందించారు. ఈ సమీక్షలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 30-12-2025 | సంపుటి - 26 | సంచిక -222 | రూ : 4 | పేజీలు: 8



2లో

ప్రభుత్వ భూముల

## ఆక్రమణలను సహించం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అసెంబ్లీలో కేసీఆర్ తో..

## రేవంత్ రెడ్డి కరచాలనం..

- కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించిన ముఖ్యమంత్రి
- ఆరోగ్యం గురించి వాకబు చేసిన రేవంత్
- రెండు నిమిషాలు సభలో ఉండి వెళ్లిపోయిన కేసీఆర్

2లో





2లో

## గ్రేటర్ హైదరాబాద్ లో ఈకేవైసీ చేసుకోకుంటే రేషన్ కట్

- హైదరాబాద్ లోని రేషన్ లబ్ధిదారులకు డీలర్ల హెచ్చరిక
- దగ్గర్లోని రేషన్ షాపుల్లో వేలిముద్రలు ఇవ్వాలని సూచన
- పాత కార్డులతో పాటు కొత్త కార్డుదారులకూ తప్పనిసరి

## రైల్లో మంటలు..

- సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు స్పందన
- టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనలో ఒక ప్రయాణికుడు దుర్మరణం
- రెండు కోచ్‌లను వేరు చేసి మంటలార్పిన సిబ్బంది
- ప్రమాద కారణాలపై రైల్వే శాఖ విచారణ



2లో



2లో

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు

- బలూచిస్థాన్‌లో భీకర దాడులు
- పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలే లక్ష్యం
- దాడులకు బాధ్యత వహించిన బీఎల్ఏ, బీఎల్ఎఫ్, బీఆర్జీ సంస్థలు
- సీపెక్ మార్గంలో సైనిక వాహనంపై రిమోట్ కంట్రోల్ బాంబు దాడి
- బలూచిస్తాన్ స్వాతంత్య్రం కోసమే దాడులని ప్రకటించిన బలోచ్ గ్రూపులు

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను



2లో

- మీడియా ప్రతినిధులతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి
- ఆసుపత్రికి వెళ్లి కూడా కేసీఆర్‌ను కలిశానని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని వ్యాఖ్యలు
- సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్ధం కావాలని దిశానిర్దేశం

ముగిసిన..

## ఏపీ క్యాబినెట్ సమావేశం



- ప్రజాభీష్టం మేరకు జిల్లాల పునర్వ్యవస్థీకరణకు క్యాబినెట్ ఆమోదం
- మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు నిర్ణయం
- అన్నమయ్య జిల్లా పేరు యథాతథం, జిల్లా కేంద్రం మదనపల్లెకు మార్పు
- మొత్తం 24 కీలక అంశాలపై చర్చించి ఆమోదించిన మంత్రివర్గం
- జనవరి 1 నుంచి కొత్త మార్పులు అమల్లోకి

2లో

# న్యూ ఇయర్ వేడుకలు కుటుంబ సభ్యులతో ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలి

* **31న జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**
* **జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కుటుంబ సభ్యులతో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జరుపుకునే వేడుకలకు సంబంధించి ప్రజలకు ఎస్పీ పలు సూచనలు చేశారు. 31న పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే ఏ కార్యక్రమమైనా తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్స్‌లు ఏర్పాటు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని హెచ్చరించారు. టపాసులు, మైకులు వినియోగించి ప్రజలను ఇబ్బంది పెట్టితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా వ్యాప్తంగా డీజేలు పూర్తిగా నిషేధమని, నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తే డీజేలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ చేయడం, వాహనాల సైలెన్సర్ తొలగించి శబ్ద కాలుష్యం సృష్టించిన, త్రిబుల్ రైడిగ్ చేయడం లాంటి చర్యలకు పాల్పడితే కేసులతోపాటు జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. ఇళ్లు, ప్రైవేట్ ఆస్తులు, వీధి దీపాలపై రాళ్లు వేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం, మహిళలను ఇబ్బంది పెట్టడం లేదా అసభ్యంగా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకలలో నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ప్రమాదం జరిగితే సంరక్షకులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనల ఉల్లంఘనలపై ప్రజలు వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు, యువత నూతన సంవత్సర వేడుకలను తమ కుటుంబ సభ్యులతో కలిసి శాంతియుతంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీసు శాఖ తరుపున 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ఆవిష్కరణ




జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ కాలని సంక్షేమ సంఘం రూపోందించిన నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ను సోమవారం కాలనీ అధ్యక్షుడు పచ్చిమట్ల నరేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ప్రతాపరెడ్డి లు పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు బీసు వెంకటేశం గౌడ్, మిక్సర్ రాములు , నరసింహ పుండరీకం, ఈశ్వర్, మల్లేష్, నాగరాజు, మల్లేష్, రాఘవేంద్ర స్వామి గౌడ్, యాదిరెడ్డి, ప్రవీణ్ కుమార్ గౌడ్, శివ పాటిల్, సాయిబాబా, బీచుపల్లి రాజు, ప్రదీప్ రెడ్డి, సాయి, అంబయ్య, కమిటి సభ్యులు , కాలనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పంచశీల పాఠశాల నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ఆవిష్కరణ



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరం సందర్భంగా మూసాపేటలోని పంచశీల పాఠశాల యజమాన్యం రూపోందించిన నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ను సోమవారం కార్పొరేటర్ మహేందర్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్ కుమార్, పి.బాబురావులు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ , నాయకులు ఎన్ ఎస్ నారాయణ, తూము వేణు, తూము సంతోష్, బండ బద్దల భాస్కరరావు, రవి గౌడ్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు.. అప్రమత్తంగా ఉండాలి

**: డిప్యూటీ CM భట్టి ఆదేశం**



శాసన మండలి, శాసనసభ రెండు చట్టసభలు ప్రజాస్వామ్యానికి ప్రతీకలని, సభ్యుల ప్రశ్నలకు సంతృప్తికరంగా సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత సీఎం, మంత్రులపై ఉన్నందున సభలు జరుగుతున్న నేపథ్యంలో సీనియర్ అధికారులు అంతా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. పారదర్శకంగా, వేగంగా మంత్రులకు, సభ్యులకు సమాచారం అందించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని మొదటి సమావేశ మందిరంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీనియర్ అధికారులతో సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత ప్రజాసామికంగా సభ జరిపేందుకు ప్రభుత్వం సీరియస్ గా ఆలోచన చేస్తుందని, ప్రజలకు, సభ్యులకు జవాబుదారీగా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉన్నందున అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం సూచించారు. సమావేశాలకు మంత్రులు చాలా సీరియస్ గా ప్రిపేర్ అయి వస్తున్నందున అధికారులు కూడా అందుకు అనుగుణంగా పూర్తి సమాచారంతో సభలు జరిగినన్ని రోజులు అందుబాటులో ఉండాలని తెలిపారు.

## మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలి

**సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ**



హైదరాబాద్: న్యాయస్థానాల్లో పెండెన్సీ సమస్యకు పరిష్కారం మధ్యవర్తిత్వంతోనే సాధ్యమని, ఇందుకు కోర్టులకు సమాంతరంగా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహ పేర్కొన్నారు. మధ్యవర్తిత్వంలో న్యాయవాదులకు తగినంత శిక్షణ ఇచ్చి నిపుణులుగా తీర్చిదిద్దాలని, ఈ బాధ్యతను బార్ కౌన్సిల్‌తోపాటు బార్ అసోసియేషన్‌లు తీసుకోవాల్సి ఉందన్నారు. హైదరాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ పి.ఎస్.నరసింహ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కోర్టుకు వచ్చినపుడు తమకు ఏం కావాలో కక్షిదారులు స్పష్టంగా డిమాండ్ చేస్తుండటంతో న్యాయవాద వృత్తి సవాలుగా మారిందని చెప్పారు. న్యాయవాదిగా రాణించాలంటే కక్షిదారుల విశ్వాసాన్ని పొందాల్సి ఉందన్నారు.

## టియుడబ్ల్యుజె (టీజేఎఫ్) మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

* **అధ్యక్షులుగా కోలా వెంకటేశ్వర్లు**
* **కార్యదర్శిగా కొలిపాక వెంకట్ నియామకం**





(ప్రజాస్ఫూర్తి, మేడ్చల్) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ , టీజేఎఫ్ (హెచ్ 143) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శు లుగా కోలా వెంకటేశ్వర్లు (మేడ్చల్ జిల్లా సాక్షి రిపోర్టర్), కొలెపాక వెంకట్ (కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నమస్తే తెలంగాణ ఇన్చార్జి) లు ఎంపిక అయ్యారు. ఈ మేరకు టీయూడబ్ల్యూజే, టీజేఎఫ్ అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ అధ్యక్ష, కార్యదర్శులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వెంకటేశ్వర్లు, వెంకట్ లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అల్లం నారాయణ, ఆస్కానీ మారుతి సాగర్ కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రధానంగా జర్నలిస్టులను విడగొట్టేందుకు ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన జీవో 252కు సవరణకు జర్నలిస్టులందరినీ ఐక్యం చేసి పోరాటం కొనసాగిస్తామన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అదే సమయంలో జర్నలిస్టులకు జారీ చేసిన హెల్త్ కార్డులు కార్పొరేట్ ఆసుపత్రుల లో పనిచేసేలా పోరాడుతామన్నారు. జర్నలిస్ట్ లలో ఐకృత పెంపొందేలా బహుముఖ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

## ప్రజావాణి లో స్వీకరించిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా పరిష్కరించాలి



మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అధికారులకు సూచించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (115) ఫిర్యాదులు అందాయి. ఈ ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ ఆన్ లైన్ లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ సూచించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. అదేవిధంగా సిఎంఓ ప్రజావాణి పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఉన్న.. యూరియా నిల్వలు సాగుకు సరిపోతాయి

* **మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : ప్రస్తుతం జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు సాగుకు సరిపోతాయని, అవసరాన్ని బట్టి మరిన్ని సరఫరాలు కూడా క్రమం తప్పకుండా అందుతున్నాయని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి రైతులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో ఈ రోజు వరకు 773 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి సేల్ కౌంటర్ వద్ద షామియానా , త్రాగు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉదయం 6.00 గంటల నుండి కౌంటర్ వద్ద యూరియా సేల్స్ ప్రారంభించాలని తెలిపారు. యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. జిల్లాకు అవసరమైన యూరియా ఎరువులు సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను కలెక్టర్ కోరారు.

## బాచుపల్లి బైరం చెరువు పెద్ద చెరువు ను ఆధునికరించాలి

* **ప్రజావాణిలో ఫిర్యాదు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : వేసవికాలంలో యుద్ధ ప్రాతిపదికన చుట్టూ బంద్ నిర్మించి వాటిని స్టోన్ పిచ్చింగ్ ద్వారా పరిరక్షించాలని మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు అన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాచుపల్లి బైరం చెరువు పెద్ద చెరువు ను హెచ్ఎండిఏ ద్వారా ఆధునీకరణ , సుందరీ కరణ కు కార్యచరణ రూపు దాల్చినందువల్ల గత వర్షాకాలం సమయంలో చెరువు కట్ట తెగి పరిసర ప్రాంతాల ఇల్లు జలమయమయ్యే పరిస్థితిని చూశామన్నారు. తృటిలో ప్రాణం నష్టం , ఆస్తి నష్టం నుంచి తప్పించుకోవడం జరిగిందన్నారు. వేసవికాలంలో యుద్ధ ప్రాతిపదికన చుట్టూ బంద్ నిర్మించి వాటిని స్టోన్ పిచ్చింగ్ ద్వారా పరిరక్షించి ఇన్ లెట్స్ ను , అవుట్ లైట్స్ ను ఎస్ఎన్డిపి నాళాలకు అనుసంధానం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా నాయకులు దాసి నాగరాజు, బిజెపి జిల్లా నాయకులు రచ్చ చక్రధర్ పాల్గొన్నారు.

## 100% ఉద్యోగ అవకాశాలు కల్పించే ట్రైనింగ్స్ బయలుదేరిన భద్రాద్రి జిల్లా యువత



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం ఆద్వర్యంలో జిల్లాలో యువతీ, యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎల్ఎస్సి (లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్) రీడింగ్టన్ ఫౌండేషన్ (సిఓఎల్టీఈ) సహకారంతో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ అండ్ 100% ప్లేస్ మెంట్ సపోర్ట్ ప్రోగ్రాం కు సెలెక్ట్ ఐన యువతి యువకులు (26) మందిని సోమవారం కలెక్టరేట్ నుండి వారికోసం ప్రత్యేకంగా బస్ ఏర్పాటు చేసి హైదరాబాద్ ట్రైనింగ్స్ కు పంపించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని పేద కుటుంబాలకు చెందిన యువతి యువకులు ఈ లాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రపంచం లో వేగంగా అభివృద్ధి చెందుతూ ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగం లాజిస్టిక్స్, ఎక్స్‌పోర్ట్ & ఇంపోర్ట్ రంగమని, ఈ రంగంలో 100% ప్లేసెమెంట్ సపోర్ట్ ఉన్నందున ప్రతిఒక్కరు ట్రైనింగ్ తీసుకోని ఉద్యోగం పొందాలని, మీ కుటుంబ సభ్యులు గర్వ పడేలా, జిల్లాకు ఆదర్శవంతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చూచించారు.

## తిరుమలలో CM రేవంత్ రెడ్డి కుటుంబం



తిరుమల : రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి సోమవారం రాత్రి తిరుమలకు వెళ్లారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సబ్యులు మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, రేణిగుంట విమానాశ్రయంలో రేవంత్ రెడ్డికి ఏపీ మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అధికారులు స్వాగతం పలికారు. సీఎం సతీమణి, కూతురు, అల్లుడు, మనుమడిని ఆప్యాయంగా పలుకరించారు. దర్శనం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# వైభవంగా తెప్పోత్సవం

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం భద్రాచలంలో గోదావరి నది తీరంలో నిర్వహించిన తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బాణాసంచా వెలుగులు, తారాజువ్వల జిలుగుల మధ్య హంస ఆకారంలో అలంకరించిన తెప్పపై విహరించిన స్వామివారి దర్శనం భక్తులకు కనువిందు చేసింది. ఆధ్యాత్మిక వైభవంతో సాగిన ఈ తెప్పోత్సవం సందర్భంగా గోదావరి తీర ప్రాంతమంతా భక్తి శ్రద్ధలతో మార్మోగింది. అలంకరించిన హంస ఆకార తెప్పపై స్వామివారి విహారం మంత్రోచ్చారణలు, భజనలు, హరినామ సంకీర్తనల మధ్య ఘనంగా కొనసాగింది.స్వామి వారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా గోదావరి నది వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారి దర్శనం చేసుకున్నారు. తెప్పోత్సవం సందర్భంగా భద్రాచలం పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో నిండిపోయి, ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు..












## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

* **పర్యావరణ ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సూరారం ఎక్స్ రోడ్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యావరణ ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరారం ఎక్స్ రోడ్ లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్డు నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. సూరారం ఎక్స్ రోడ్ లో రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించే విధంగా ఫారెస్ట్ అధికారులతో మాట్లాడాలని కోరారు. కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ అవడం ప్రజలకు ఉద్యోగస్తులకు విద్యార్థులకు తీవ్ర ఆలస్యమవుతుందన్నారు. అలాగే సర్కిల్ పరిధిలో నాణ్యతలేని ప్లాస్టిక్, ఇస్తరాకులు విచ్చలవిడి గా,వాడడం వల్ల గోమాత, జలమాత,భూమాత, సర్వనాశనమయ్యే ప్రమాదం ఉంది కావున ఫంక్షన్ హాల్ వాళ్లకు హోటల్స్ లకు,రైతు బజార్ వారికి,వచ్చే నెలలో జాతర్లలో మీరు ముందుగా నోటీసులు ఇవ్వాలని గుడిలో ప్లాస్టిక్, కవర్లు, ఇస్తార్లు, వాడరాదనీ ఆ యొక్క కమిటీ అధ్యక్షులకు, కార్యదర్శులకు, ఎండోమెట్, వారికి తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్నె పోచయ్య, అనిల్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి..

* **గ్రేటర్ పరిధిలోని మండలల్లో అక్రిడిటేషన్ల సంఖ్య పెంచాలి**
* **ఐ అండ్ పి ఆర్ కమిషనర్ కు విజ్ఞప్తి చేసిన టి యు డబ్ల్యూ (ఐ జె యు) బృందం**



(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : గ్రేటర్ హైదరాబాద్ పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా జీవోలో సవరింపులు చేపట్టాలని కోరుతూ టి యు డబ్ల్యూ జే (ఐజయు) బృందం సమాచార శాఖ కమిషనర్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సచివాలయం లోని ఐ అండ్ పిఆర్ కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ ప్రియాంకను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్ యు జె అధ్యక్షులు శిగా శంకర్, మేడ్చల్ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సలీం పాషా, మేడ్చల్ కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణలు సమస్యను ఆమెకు వివరించారు. గ్రేటర్ పరిధిలోని అర్బన్ మండలాలలో ప్రధాన పత్రికలలో నలుగురు నుంచి ఐదుగురు జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని ఆమెకు తెలిపారు. నూతన జీవో 252 ద్వారా ఒక పత్రికకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ పొందే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ముగ్గురు నలుగురికి అక్రిడిటేషన్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రూరల్ మండలాలతో కాకుండా అర్బన్ మండలాలను ప్రత్యేకంగా చూడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆవేదనలు దృష్టిలో ఉంచుకొని జీవోలో సవరణలు చేసి న్యాయం చేయాలని కోరారు.

* **సానుకూలంగా స్పందించిన కమిషనర్**

గ్రేటర్ పరిధిలోని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్య పై పౌర సంబంధాలు అండ్ సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక సానుకూలంగా స్పందించారు. అర్బన్ మండలాలలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ లు ఇవ్వడం న్యాయ బద్ధమైనదని తెలిపారు. త్వరలోనే మంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీని ఇచ్చారు.

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఎక్కడున్నా పంపించేస్తాం

బంగ్లాదేశ్ చొరబాటుదారులు అస్సాంలోనే కాకుండా..దేశంలో ఎక్కడున్నా పంపించేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అస్సాంలో నిర్వహించిన బహిరంగ ర్యాలీలో పాల్గొన్న అమిత్‌షా మాట్లాడుతూ..పొరుగు దేశం నుంచి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అటువంటి వారిని కాంగ్రెస్ ఓటు బ్యాంకుగా భావిస్తోందన్నారు. ఆ ఓటు బ్యాంకును రక్షించుకునేందుకే ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(ఎస్ఐఆర్)



ను వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. అస్సాంలో కాంగ్రెస్ ఎన్నోఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అమిత్ షా అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటమే కాకుండా రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపైనా దృష్టి పెట్టారన్నారు. బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని అమిత్ షా అన్నారు. రాష్ట్రంలో పాగా వేసిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి భాజపాకు మరో అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. గత 11 ఏళ్లలో భాజపా ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందాలు చేసుకుందన్నారు.

## దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక ప్రయోగం విజయవంతం

భువనేశ్వర్: దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్ పినాక ప్రయోగం విజయవంతమైంది. ఒడిశాలోని చండీపూర్ నుంచి డీఆర్‌డీవో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. పినాకకు 120 కి.మీ దూరంలో లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యం ఉంది. ఎల్ఆర్‌జీఆర్ 120 ప్రయోగం విజయవంతమైందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ప్రయోగం చేపట్టిన డీఆర్‌డీవోను అభినందించారు.



## ఇంజిన్ లేదు..కొబ్బరి నారతోనే స్టిచింగ్
## ఒమన్ వైపుగా 'ఐఎన్ఎస్‌వీ కౌండిన్య' ప్రయాణం

నౌకాదళంలో అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. సోమవారం ఐఎన్ఎస్‌వీ కౌండిన్య గుజరాత్‌లోని పోర్‌బందర్ నుంచి ఒమన్‌లోని మస్కట్ వరకు ప్రయాణం మొదలుపెట్టింది. పురాతనకాలంలో నౌకాయానం కోసం భారత్ ఉపయోగించిన విధానాలను పరీక్షించేందుకు ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. 1500 ఏళ్ల క్రితం నాటి టెక్నిక్స్‌ను ఉపయోగించి.. రెండేళ్లపాటు దీనిని నిర్మించారు. ఈ ఆధునికయుగంలో ఎలాంటి యంత్రాల అవసరం లేకుండా చేతులతో నిర్మించడం విశేషం.

**ఇంజిన్ లేదు.. మేకులు కొట్టలేదు..**

ఐఎన్ఎస్‌వీ కౌండిన్య నిర్మాణం 2023లో ప్రారంభమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ, భారత నౌకాదళం, హోదీ ఇన్నోవేషన్స్ ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యాయి. కేరళకు చెందిన బాబు శంకరన్ బృందం దీనిని నిర్మించింది. ఎలాంటి బ్లూప్రింట్స్ లేకపోయినా.. రచనల్లోని కొన్ని దృశ్యాలను ఆధారంగా చేసుకున్నారు. శాస్త్రీయ పరీక్షలను ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించారు. ఫిబ్రవరి 2025లో ఇది ప్రారంభం కాగా.. మే నెలలో కర్ణాటకలోని కార్వార్‌లో నౌకాదళంలో చేరింది. 19.6 మీటర్ల పొడవు, 6.5 మీటర్ల వెడల్పుతో కూడిన నౌక.. పూర్తిగా తెరచాపలతో నడుస్తోంది. టంకాయి పద్ధతిలో నిర్మించిన దీనిలో 15 మంది సెయిలర్లు ప్రయాణిస్తున్నారు. ఈ పద్ధతిలో లోహాన్ని ఉపయోగించరు. బలమైన గాలులు వీచినా విరిగిపోకుండా.. ఒత్తిడి తట్టుకునేలా కౌండిన్యను నిర్మించారు. చెక్క, కొబ్బరి పీచునుంచి తయారుచేసిన తాళ్లు, ఉప్పునీటికి దెబ్బతినకుండా సహజమైన జిగురు పదార్థాలు, నూనెలు వాడారు. ఆధునిక నౌకలకు భిన్నంగా ఇందులో ఎలాంటి ఇంజిన్ లేదు. మేకులు వాడలేదు. చెక్క పలకలను అమర్చేందుకు తాళ్లనే వాడటంతో దీనిని 'స్టిచ్‌డ్ షిప్' అని పిలుస్తున్నారు. గాలి దిశ, తెరచాపలపై ఆధారపడి దాని పయనం సాగుతోంది. కౌండిన్య నౌకాదళానికే చెందినదే అయినా.. ఇది యుద్ధ నౌక కాదు. దీనిని 'కౌండిన్య' పేరిట తయారు చేశారు. భారత్ నుంచి తొలి నావికుడిగా ఆయనకు పేరుంది. ఈ నౌకకు కదంబ పాలకుల రాజలాంఛనంగా ఉన్న గండభేరుండ చిత్రం, ఒక తెరచాపపై సూర్యుడి ఆకృతి కనిపిస్తోంది. ఒమన్, ఆగ్నేయాసియా ప్రధాన వాణిజ్య మార్గంలో భారత్ కీలకంగా ఉండేది. ఈ మార్గంలో సుగంధ ద్రవ్యాలు, వస్త్రాల వ్యాపారం జరిగేది.



## అతడిని విడుదల చేయకండి : ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీం కీలక ఆదేశాలు

ఢిల్లీ: ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బహిష్కృత భాజపా నేత కుల్దీప్ సింగ్ సెంగర్ కు విధించిన శిక్ష నిలిపివేతపై స్టే విధించింది. సెంగర్ జైలు శిక్షను సస్పెండు చేస్తూ దిల్లీ హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై సీబీఐ అధికారులు, బాధితురాలి తరఫు న్యాయవాదులు చేసిన అప్పీల్‌పై సోమవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. దిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. సీబీఐ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలంటూ సెంగర్‌కు సుప్రీం నోటీసులు జారీ చేసింది. కస్టడీ నుంచి అతడిని విడుదల చేయొద్దని పోలీసుశాఖను ఆదేశించింది. 2017లో కుల్దీప్ సింగ్ సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆగస్టు 1, 2019న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత



ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి దిల్లీ హైకోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసుపై ఇటీవల విచారణ జరిపిన దిల్లీ హైకోర్టు సెంగర్ శిక్షను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా బాధితురాలు, మహిళా సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ తీర్పుపై బాధితురాలి తరఫు న్యాయవాదులు, సీబీఐ అధికారులు సుప్రీంను ఆశ్రయించారు.



## దిల్లీలో రెడ్ అలర్ట్.. విమాన సర్వీసులకు అంతరాయం

దేశ రాజధానిని పొగమంచు కప్పేసింది. అతి సమీపంలోని వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఎదురవడంతో వాతావరణ శాఖ దిల్లీలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి వాతావరణం దారుణంగా మారడంతో రోడ్డు, రైలు, వాయు మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉత్తరాది రాష్ట్రాలైన పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, బిహార్‌లను దట్టమైన పొగమంచు కప్పేసిందని, ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం వెల్లడైందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. సోమవారం తెల్లవారుజామున దిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ 403గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వివేక్ విహార్ (460), ఆనంద్ విహార్ (459), రోహిణి (445), వజీర్‌పూర్ (444) ఏక్యూఐలతో అత్యంత ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కాలుష్య స్థాయిలు తీవ్రమైన జోన్‌లోకి ప్రవేశిస్తున్నందున నియంత్రణ చర్యలను ముమ్మరం చేస్తున్నామన్నారు. విజిబిలిటీ తగ్గిపోవడంతో రైలు, విమాన సర్వీసుల్లో జాప్యం నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన పొగమంచు వల్ల రాజధాని ఎక్స్‌ప్రెస్, వందేభారత్, జన శతాబ్దితో సహా పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయన్నారు. దిల్లీ విమానాశ్రయం సైతం ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల రద్దు, ప్రయాణ సమయాల్లో మార్పుల గురించి తెలుసుకోవడానికి తమ అధికారిక వెబ్‌సైట్లను తనిఖీ చేయాలని విమానయాన సంస్థలు ప్రయాణికులకు సూచించాయి. ప్రయాణికులు విమానాల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సోమవారం అన్ని విమానయాన సంస్థల కస్టమర్ సపోర్ట్ ఫోన్ నంబర్‌లను విడుదల చేసింది.

# రూ.13 కోట్ల విలువైన పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా!

శేరిలింగంపల్లి: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మదీనాగూడలో 1000 గజాల పార్కు స్థలాన్ని అక్రమార్కుల చెర నుంచి హైడ్రా కాపాడింది. స్థలం విలువ దాదాపు రూ. 13 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. సర్వే నంబర్ 23లో ఉషోదయ ఎన్‌క్లేవ్ పేరిట హుడా అనుమతి పొందిన లేఅవుట్ ఉంది. అందులో వెయ్యి గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. జీహెచ్ఎంసీకి ఈ మేరకు గిఫ్ట్‌డీడ్ కూడా చేశారు. అయితే, ప్రజల వినియోగంలో ఉండాల్సిన పార్కు స్థలాన్ని స్థానికంగా ఉండే ఓ వ్యక్తి కబ్జా చేసి ప్రీకాస్ట్ వాల్ నిర్మించారు. ఈ విషయంపై ఉషోదయ ఎన్‌క్లేవ్ నివాసితులు




పోరాటం చేస్తూనే ఉన్నారు. చివరికి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. పార్కు స్థలంగానే నిర్ధారించి ప్రహరీని కూల్చి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి బోర్డును పెట్టింది.

## తెలంగాణలో నాలుగు కమిషనరేట్ల ఏర్పాటు.. ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్‌బాబు

హైదరాబాద్: తెలంగాణలో పోలీసు కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరించారు. 3 కమిషనరేట్లను పునర్వ్యవస్థీకరిస్తూ నాలుగింటిని ఏర్పాటు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లుగా విభజన చేశారు. వీటి పరిధి నుంచి భువనగిరిని మినహాయించారు. మరోవైపు పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేశారు. ఫ్యూచర్ సిటీ సీపీగా సుధీర్‌బాబు, మల్కాజిగిరి సీపీగా అవినాష్ మహంతి, సైబరాబాద్ సీపీగా రమేశ్ రెడ్డి, యాదాద్రి జిల్లా ఎస్పీగా అక్షాంశ్ యాదవ్ నియమితులయ్యారు.







## మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలు.. ఓటరు జాబితా సవరణకు నోటిఫికేషన్

హైదరాబాద్: తెలంగాణలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే 117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లలో ఓటరు జాబితా సవరణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 10 వరకు ఓటరు జాబితా తయారీకి ఎస్ఈసీ కసరత్తు చేయనుంది. కొత్తగూడెం, కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల కార్పొరేషన్లలో ఓటరు జాబితా తయారీ ప్రక్రియను ప్రారంభించనుంది.

## 14 ఏళ్ల నాటి మహిళ హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు.. దోషికి మరణశిక్ష

హైదరాబాద్: మహిళ హత్య కేసుకు సంబంధించి మేడ్చల్ మల్కాజ్‌గిరి మూడో అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. దోషి కరణ్ సింగ్‌కు మరణ శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన కరణ్ సింగ్ హైదరాబాద్‌లో ఇనుప పనిముట్లు తయారు చేస్తుంటాడు. 2011 జులై 18న సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్‌లో ఓ మహిళపై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. అప్పట్లో ఈ ఘటన పెను సంచలనంగా మారింది. హత్య కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు కేవలం రోజుల వ్యవధిలోనే కరణ్ సింగ్‌ను పట్టుకున్నారు. అనంతరం కీలక ఆధారాలు సేకరించారు. దర్యాప్తు చేసి



ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. వాదనలు విన్న మేడ్చల్ జిల్లా న్యాయస్థానం కరణ్ సింగ్‌ను దోషిగా తేలుస్తూ మరణశిక్ష విధించింది.

## ముగిసిన ఐబొమ్మ రవి పోలీసు కస్టడీ



హైదరాబాద్: ఐబొమ్మ నిర్వాహకుడు రవి పోలీసు కస్టడీ విచారణ ముగిసింది. అతడికి న్యాయస్థానం విధించిన 12 రోజుల పోలీసు కస్టడీ ఇవాళ్టితో ముగిసింది. ఐబొమ్మ కేసులో కీలక వివరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సేకరించారు. బ్యాంక్ లావాదేవీలను రవి ముందుంచి విచారించారు. ప్రహ్లాద్ అనే వ్యక్తి డాక్యుమెంట్లను రవి దొంగిలించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే ప్రహ్లాద్‌ను బెంగళూరు నుంచి పిలిపించి రవి ఎదుటే విచారించారు. తన పేరుతో రవి పాన్, లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసి ప్రహ్లాద్ షాక్‌కు గురయ్యారు.

## ఉద్యోగుల గురించి హరీశ్‌రావు వ్యాఖ్యలు విడ్డూరం

హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలపై మాజీ మంత్రి హరీశ్‌రావు శాసనసభలో మాట్లాడారు. మొత్తం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని కోరారు. పింఛన్ బకాయిలు రావట్లేదని 39 మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారని హరీశ్‌రావు అన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉద్యోగుల గురించి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సభ్యుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

## డిజిటల్ అరెస్ట్ కేసులో ఇద్దరు నిందితులు అరెస్ట్

హైదరాబాద్: డిజిటల్ అరెస్ట్ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను గుజరాత్‌కు చెందిన వారిగా గుర్తించారు. సయ్యద్ సోయబ్ జాహిద్, బెలిమ్ అనస్ రహీమ్‌ను అరెస్ట్ చేశారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన బాధితురాలిని నిందితులు భయపెట్టారు. ప్రభుత్వ, టెలికాం అధికారులుగా నటిస్తూ నకిలీ ఫోన్ కాల్స్ చేశారు. బాధితురాలి భర్తపై కేసులంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితురాలి నుంచి రూ. 1.95 కోట్లను కాజేశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టగా.. మ్యూల్ బ్యాంక్ ఖాతాల నుంచి నగదు మళ్లించినట్లు గుర్తించారు. దేశవ్యాప్తంగా 22 కేసుల్లో నిందితుల పాత్ర ఉన్నట్లు తేలింది. నిందితుల బ్యాంక్ ఖాతాల నుంచి 3.5 కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. డిజిటల్ అరెస్ట్ పేరిట డబ్బులు అడిగితే ఎవరూ నమ్మవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



*** న్యూ ఇయర్.. ఆ లింకులు క్లిక్ చేయొద్దు..**

న్యూ ఇయర్ పేరుతో వాట్సప్‌లో నకిలీ గ్రీటింగ్స్, ఆఫర్ లింకులను క్లిక్ చేయొద్దని టీజీసీఎస్‌బీ హెచ్చరించింది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఆఫర్ల పేరుతో లింకులు వస్తాయని తెలిపింది. లింక్ క్లిక్ చేస్తే ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అవుతుందని పోలీసులు తెలిపారు. గ్రూప్ మెసేజ్‌ల ద్వారా స్కామ్ లింకులు ఫార్వర్డ్ అవుతున్నట్లు గుర్తించామన్నారు. వాట్సప్ టూ స్టెప్ వెరిఫికేషన్ ఆన్ చేయాలని పోలీసులు సూచించారు. ఏపీకే ఫైల్ ద్వారా ఓటీపీ, బ్యాంక్ వివరాలు, వాట్సప్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారని, మెసేజ్ లింకుల ద్వారా యాప్‌లను ఇన్‌స్టాల్ చేయొద్దని పోలీసులు సూచించారు. సైబర్ మోసం జరిగితే బాధితులు వెంటనే 1930కు కాల్ చేయాలని చెప్పారు. మోసపోతే cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

## ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలను బయటపెడతాం



**: మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్: ఇరిగేషన్‌లో తానే మాస్టర్ అని హరీశ్ రావు అనుకుంటున్నారని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. హరీశ్ రావుకు అంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు. హరీశ్‌రావు దిగుజారుడు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎవరి హయాంలో ఏం జరిగిందో అన్ని పత్రాలు బయటపెడతామన్నారు. ఈ సందర్భంగా పాత జీవో కాపీలను మీడియాకు చూపించారు. కృష్ణా జలాల్లో మేము 90 టీఎంసీలు డిమాండ్ చేసినట్లు ఉత్తమ్ తెలిపారు. కానీ, 45 టీఎంసీలు అడిగామని దుష్ప్రచారం చేశారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీదే భారత రాష్ట్ర సమితి బతుకుతోందని.. తెలంగాణకు అన్యాయం జరిగేలా తాను ఎందుకు లేఖ రాస్తానని ప్రశ్నించారు. సీడబ్ల్యూసీకి రాసిన లేఖలో ఒక భాగాన్నే చూపిస్తున్నారని ఆక్షేపించారు. కృష్ణా బేసిన్‌పై అసెంబ్లీలో ప్రజెంటేషన్‌కు తాము సిద్ధమని వెల్లడించారు. మేడిగడ్డ మరమ్మతులపై ఎల్అండ్‌టీకి నోటీసులిచ్చామని తెలిపారు. మేడిగడ్డలో పలు పరీక్షలు, ఇతర తనిఖీలకు ఎల్అండ్‌టీ అంగీకరించినట్లు చెప్పారు. త్వరలోనే మేడిగడ్డ పనులు మొదలవుతాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## సీఎం రేవంత్ తిట్లు నాకు దీవెనలు: కేటీఆర్

హైదరాబాద్: పాలమూరురంగారెడ్డి విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి రంధ్రాన్వేషణ వల్ల రాష్ట్రానికే నష్టమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అనుమతులు దృష్టిలో ఉంచుకుని తాగునీటి పేరుతో పనులు చేశామని చెప్పారు. కేసీఆర్ చిత్తశుద్ధిని కాళేశ్వరం విషయంలో చూడాలన్నారు. మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి దోపిడీని అడుగడుగునా అడ్డుకుంటున్నందుకే దూషిస్తున్నారు. ఆయన తిట్లు నాకు దీవెనలు. నన్ను తిడితే పడతాను కానీ.. కేసీఆర్‌ను అంటే ఊరుకునేది లేదు. ఆయనకు మంచి పేరు వస్తుందనే పాలమూరు రంగారెడ్డి పనులు చేయట్లేదు. కాల్వల కోసం పిలిచిన టెండర్లను రేవంత్ ప్రభుత్వం రద్దు చేసింది. గోదావరిలో నీటి హక్కుల కోసమే కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులను కేసీఆర్ చేపట్టారు" అని కేటీఆర్ అన్నారు.

*** నేతల బలం లేకున్నా సర్పంచ్‌లను గెలిపించుకున్నాం**

పార్టీని వదిలి వెళ్లిన నేతలను మళ్లీ తీసుకోవాల్సిన అవసరం లేదన్నది తన అభిప్రాయమని



కేటీఆర్ వ్యాఖ్యానించారు. "బీఆర్ఎస్‌ను కాదని భాజపాలోకి వెళ్లిన నేతల నియోజకవర్గాల్లో ఎన్ని సర్పంచ్ స్థానాలు గెలిచారో చూశాం కదా! నేతల బలం లేకున్నా మా కార్యకర్తలు సర్పంచ్‌లను గెలిపించుకున్నారు. 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని న్యాయస్థానంలో పోరాడుతున్నాం.. వారితో మాకేం సంబంధం? వారి విషయంలో సీఎం మాటలు విడ్డూరంగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి, సర్పంచ్ ఎన్నికల నాటికి పరిస్థితులు చాలా మారాయి. అందుకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టడం లేదు. ఫైనాన్స్ కమిషన్ నిధుల కోసమే తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ పరిస్థితి బాగోలేదు. కడియం నా గురించి ఏం మాట్లాడతారు? వాస్తవాలు దాచలేరు కదా! పోచారం ఈ వయసులో ఏం సాధించారు? గౌరవం నిలబెట్టుకోవాలి కదా" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

*** కేసీఆర్ పట్ల గౌరవం ఉంటే చాలు..**

మాజీ సీఎం కేసీఆర్‌ను సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో పలకరించడంపై కేటీఆర్ స్పందించారు. "తెలంగాణ తెచ్చిన నాయకుడిగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్కరికి గౌరవం ఉంది. ముఖ్యమంత్రి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలు. ఇదే సంస్కారం బయట మాటల్లో ఉంటే బాగుంటుంది. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదే" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉండాలి

**: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్: గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరుమన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

*** సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి: కూనంనేని**

సింగరేణి కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. "సింగరేణి పెద్ద పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్. పూర్తిగా ప్రైవేటుపరం అయ్యే అవకాశం కనిపిస్తోంది. సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ జోక్యం పెరుగుతోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు అదే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించాయి. ప్రస్తుతం కూడా అవే కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరముంది" అని కూనంనేని సాంబశివరావు అన్నారు. సభ్యులు మాట్లాడిన అనంతరం సభను స్పీకర్ ప్రసాద్‌కుమార్ జనవరి 2వ తేదీకి వాయిదా వేశారు.



# డబ్బు విషయంలో.. ఈ పొరపాట్లు వద్దు!

**సానుకూల ఆలోచనలు సానుకూల ఫలితాల్నిస్తాయంటారు. మనం చేసే పనులు, ఎంచుకున్న లక్ష్యాల పరంగానే కాదు.. డబ్బుకూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. ఆర్థిక విషయాల్లో కొన్ని పొరపాట్లు చేయకుండా పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉండడం వల్ల డబ్బు సమస్యల్లేకుండా ముందుకు సాగడంతో పాటు భవిష్యత్తుకు ఆర్థిక భరోసా అందించచ్చంటున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



### పోలికలొద్దు!

కొంతమంది ప్రతి విషయంలో ఎదుటివారితో పోల్చుకుంటుంటారు. అవి వస్తువులైనా, మరేదైనా సరే.. తమకు ఉండి ఇతరులకు లేని వాటిని పక్కన పెట్టి.. ఇతరుల వద్ద ఉన్న వాటి పైనే దృష్టి పెడుతుంటారు. ఈ క్రమంలో తమ ఆర్థిక స్థోమతనూ లెక్క చేయరు. అవసరానికి మించి అప్పులు చేయడానికీ వెనకాడరు. దీనివల్ల డబ్బు వృథా అవడంతో పాటు మానసిక సంతోషం కూడా దూరమవుతుంది. కాబట్టి ఇతరులతో పోల్చుకోవడం మాని.. ఆర్థికంగా మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నామో ముందు పరిశీలించుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అలాగే మనకొచ్చే ఆదాయాన్ని బట్టి.. ఖర్చులు, పొదుపుమదుపులు ప్లాన్ చేసుకుంటే అనవసరంగా అప్పులపాలు కావాల్సిన ముప్పు తప్పుతుంది. ఇలా ఉన్నంతలోనే సానుకూల ఆలోచనలు చేస్తే.. భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా జాగ్రత్తపడచ్చు.

### సాధ్యాసాధ్యాల్ని పరిశీలించాకే..!

ఏ విషయంలోనైనా సరే.. ముందుగా మన ఆర్థిక పరిస్థితుల్ని బట్టి సాధ్యాసాధ్యాల్ని పరిశీలించుకోవాలంటున్నారు నిపుణులు. డబ్బు విషయంలో ఇదీ ఓ సానుకూల ఆలోచనే అంటున్నారు. ఉదాహరణకు మన స్థోమతకు తగ్గట్లుగా ఎంత పెద్ద ఇల్లు కొనాలో బేరీజు వేసుకోవడం, గొప్పలకు పోకుండా.. మన వద్ద ఉన్న డబ్బును బట్టే ఇంటీరియర్ చేయించుకోవడం, ఇతర వస్తువులు కొనుక్కోవడం మంచిది. ఫలితంగా ఎలాంటి సమస్యలు రావు.. తద్వారా ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా నెమ్మదిగా మన భవిష్యత్ లక్ష్యాలను పూర్తిచేసుకోవచ్చు.



### ఈ పొరపాట్లు వద్దు!

డబ్బు విషయంలో కొంతమంది మహిళలు చేసే కొన్ని పొరపాట్లు కూడా ఆర్థికంగా వారిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో డబ్బు వ్యవహారాలన్నీ తమ భర్తలు/ఇతర కుటుంబ సభ్యుల చేతుల్లో పెట్టడం, తమకంటూ ప్రత్యేకంగా పొదుపు మదుపులు చేసుకోకుండా.. భాగస్వామిపై ఆధారపడడం.. వంటివి మంచిది కాదంటున్నారు. నిజానికి ఇలాంటివన్నీ చిన్న విషయాలే అనిపిస్తాయి.. కానీ సమయం వచ్చినప్పుడు అనిపిస్తుంటుంది.. 'అప్పుడే జాగ్రత్తగా ఉంటే ఈ సమస్యలన్నీ వచ్చేవి కాదు కదా!' అని. కాబట్టి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ పొరపాట్లేవీ చేయకుండా.. ముందుగానే ప్లాన్ ప్రకారం సానుకూల ఆలోచనలతో ముందుకు సాగడం, తమకంటూ కొంత డబ్బు వెనకేసుకోవడం.. వంటివి చేస్తే భవిష్యత్తులో ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం రాదు.

### ప్రభావితం కావద్దు..!

ఆర్థిక విషయాల్లో మనకంటూ సొంత ప్రణాళికలు, లక్ష్యాలున్నప్పటికీ.. ఇతరులు చెప్పే మాటలు, చేతలు ఒక్కోసారి మనల్ని ప్రభావితం చేస్తుంటాయి. స్థోమతకు మించి ఖర్చు పెట్టేలా, అనవసర జల్సాలకు ప్రేరేపించేందుకు కారణమవుతాయి. దీనివల్ల కూడా సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. కాబట్టి ఇలాంటి వ్యక్తుల మాటలు పట్టించుకోకుండా ఉండడంతో పాటు.. ఆర్థిక విషయాల్లో సానుకూల సలహాలిచ్చే వ్యక్తులుండేలా జాగ్రత్తపడడం, అలాంటి వారితోనే స్నేహం చేయడం, పాజిటివిటీని నింపే వాతావరణం ఉండేలా చూసుకోవడం.. ఇవన్నీ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.



# జొన్నలతో మేలెంతో..!

**అధిక బరువుతో బాధపడేవారు దాన్ని తగ్గించుకోవడానికి వివిధ ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు విపరీతమైన వర్కవుట్లు చేస్తే, మరికొందరు ఆహారపుటలవాట్లు మార్చుకుంటారు. ఇంకొందరైతే బరువు తగ్గాలని తిండి కూడా మానేస్తుంటారు. అయితే ఇలా నోరు కట్టేసుకొని బరువు తగ్గించుకునే బదులు కొన్ని రకాల చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకోవడం మేలంటున్నారు పోషకాహార నిపుణులు. ప్రత్యేకించి జొన్నలతో చేసిన వంటకాలను తరచుగా తీసుకోవడం ద్వారా బరువును అదుపులో ఉంచుకోవచ్చంటున్నారు. అంతేకాదు.. జొన్నలతో ఆరోగ్యపరంగా ఇతరత్రా అనేక ప్రయోజనాలున్నాయంటున్నారు నిపుణులు.**





* జొన్నల్లో గ్లూటెన్ ఉండదు. కాబట్టి ఇది మంచి ఆహారం.
* ఫైబర్ పుష్కలంగా ఉండే జొన్నలు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తాయంటున్నారు నిపుణులు.
* ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రించడంలోనూ తోడ్పడతాయని చెబుతున్నారు.
* ప్రొటీన్లు సమృద్ధిగా ఉండే జొన్నల్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎక్కువసేపు పొట్ట నిండుగా ఉండేలా చూసుకోవచ్చు. బరువు అదుపు చేసుకోవడానికి ఇదీ ఓ మార్గమే!
* వివిధ పోషకాలు పుష్కలంగా ఉండే జొన్నలు ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు.
* రక్తనాళాల్లో చెడు కొలెస్ట్రాల్ స్థాయులను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయులను పెంచడంలో జొన్నలు సహకరిస్తాయట.
* ఇందులో కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ కలిగి ఉండటం వల్ల శరీరంలో శక్తి స్థాయుల్ని పెంచడానికి కూడా తోడ్పడతాయని చెబుతున్నారు నిపుణులు.
* ఎన్ని ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని రకాల చిరు ధాన్యాల విషయంలో తమ శరీర తత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, సంబంధిత నిపుణుల సలహా మేరకే వీటిని ఆహారంలో చేర్చుకోవడం మంచిదన్న విషయం గుర్తుంచుకోవాలి.

# ఫర్నిచర్‌పై మరకలు పోవాలంటే..!

ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కోసారి ఫర్నిచర్‌పై రకరకాల మరకలు పడుతుంటాయి. అలాగని సరిగా శుభ్రం చేయకపోతే ఫర్నిచర్ కళ తగ్గిపోతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ఇంట్లోని ఫర్నిచర్‌ను సులభమైన పద్ధతుల్లో శుభ్రం చేసుకోవడమెలాగో తెలుసుకుందాం..!

### టూత్‌పేస్ట్‌తో..

సాధారణంగా డైనింగ్ టేబుల్ మీద గిన్నెలు, గ్లాసులు పెట్టడం వల్ల వలయాల మాదిరిగా నీటి మరకలు ఏర్పడతాయి. వీటిని తొలగించడానికి టూత్‌పేస్ట్‌ను ఉపయోగిస్తే సరిపోతుందట. కొద్దిగా టూత్‌పేస్టుని తీసుకుని దానిని నీటితో పలుచగా అయ్యేలా కలపాలి. దీనిని మరకపై రాసి కొన్ని నిమిషాల తర్వాత మెత్తని వస్త్రంతో తుడిచేయాలి. ఈ చిట్కాని ఉపయోగించి కేవలం డైనింగ్ టేబుల్ పైనే కాదు.. కిటికీలు, తలుపులపై పడిన నీటిచుక్కల మరకల్ని కూడా వదిలించేయచ్చంటున్నారు నిపుణులు.

### ఫర్నిచర్ వ్యాక్స్‌తో..

సాధారణంగా ఫర్నిచర్‌పై ఏర్పడే మరకలు నీటి వల్లే ఏర్పడతాయి. కాబట్టి వాటిని తొలగించడానికి ఫర్నిచర్ వ్యాక్స్‌ని ఉపయోగించవచ్చు. కొద్దిగా ఫర్నిచర్ వ్యాక్స్‌ని తీసుకొని మరకపై రాసి మెత్తని వస్త్రంతో తుడిచేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

### లిక్విడ్ బ్లీచ్‌తో..

చెక్కతో చేసిన ఫర్నిచర్‌పై ఏర్పడిన మరకను లిక్విడ్ బ్లీచ్‌తో తొలగించవచ్చు. ఇందుకోసం టూత్‌బ్రష్‌ను లిక్విడ్ బ్లీచ్‌లో ముంచి మరకపై సున్నితంగా రుద్దాలి. కొన్ని నిమిషాల తర్వాత మెత్తటి పొడి వస్త్రంతో తుడిచేస్తే మరక పోతుందట.

### ఇలా కూడా..!

* అరచెంచా వెనిగర్‌ని ఒక కప్పు చల్లటి నీటిలో కలపాలి. ఈ మిశ్రమంలో శుభ్రమైన వస్త్రాన్ని ముంచి మరకపై తుడవాలి.
* గోరువెచ్చని నీటిలో సబ్బు కలిపి తుడిచినా మరక చాలావరకు పోతుందట.
* కొద్దిమొత్తంలో ఉప్పు తీసుకొని ఆలివ్ ఆయిల్‌తో ముద్దలా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మరకపై రాసి కొంత సమయం తర్వాత తుడిచేయాలి.
* కొద్దిగా పెట్రోలియం జెల్లీని మరకపై రాసి మరుసటి రోజు వస్త్రంతో తుడిస్తే మరక వదిలిపోతుందని చెబుతున్నారు నిపుణులు.





# ఆరోగ్యానికి నిమ్మ

**వంటింట్లో అందుబాటులో ఉండే నిమ్మకాయంటే చాలామందికి చిన్న చూపే. కానీ, ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా దీనిలోని విటమిన్ సి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు వంటి వాటిని రాకుండా అడ్డుకుంటుంది. ఇందులోని పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. నరాల ఆరోగ్యానికి అవసరమైన పొటాషియం పుష్కలంగా వీటి నుంచి లభిస్తుంది. శరీరం ఇనుముని గ్రహించుకోవడానికి సాయపడుతుంది.**




## 2026: కొత్త ఏడాదిలో పలకరించే మొదటి సినిమాలివే!

శ్రీ నందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్ధార్థ'. వరుణ్ రెడ్డి దర్శకుడు. యామిని భాస్కర్ కథానాయిక. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 12న రావాల్సి ఉంది. అయితే, 'అఖండ2' కారణంగా వాయిదా పడి, కొత్త ఏడాదిలో ప్రేక్షకుల పలకరించడానికి వస్తోంది. జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథాంశంతో సినిమాను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.




"మహాగాయకుడు ఘంటసాల గురించి ఈతరానికి తెలియాలనే తపనతో ఎంతో కష్టపడి తీసిన సినిమా 'ఘంటసాల ది గ్రేట్'' అంటున్నారు దర్శకుడు సి.హెచ్.రామారావు. ఆయన దర్శకత్వంలో కృష్ణచైతన్య టైటిల్ పాత్ర పోషించిన చిత్రమిది. మృదుల, సుమన్, సాయికిరణ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జనవరి 2న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.




రామ్ కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సఃకుటుంబానాం'. హెచ్.మహదేవ గౌడ్ నిర్మాత. రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ కూడా తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 19న రావాల్సి ఉంది. ఇప్పుడు కొత్త ఏడాదిలో జనవరి 1న థియేటర్స్‌లో విడుదల కానుంది. అందరూ మెచ్చే మంచి కుటుంబ కథాంశంతో రూపొందుతున్న చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.



అవినాశ్ తిరువీధుల హీరోగా నటిస్తూ..స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'వనవీర'. పురాణాల టచ్‌తో సాగే గ్రామీణ నేపథ్య చిత్రంగా 'వానర' పేరుతో దీనిని విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే, సెన్సార్ బోర్డు అభ్యంతరాల మేరకు దాన్ని 'వనవీర'గా మార్చారు. అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి అంకిత్ రెడ్డి నిర్మించారు. సిమ్రాన్ చౌదరి కథానాయిక. జనవరి 1న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

# సినిమా

## డియర్ జిందగీ

చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన చాలా తక్కువ సమయంలోనే యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్న అందాల ముద్దుగుమ్మ భాగ్య శ్రీ బోర్సే. ఈ మధ్య ఎవరినోట విన్నా ఈ అమ్మడు పేరే వినిపిస్తుంది. అంతలా తన అందంతో అందరినీ మాయ చేసింది ఈ బ్యూటీ. మాస్ మహారాజ్ రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ మూవీలో నటించి మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఇందులో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఆ మూవీ రిలీజైనప్పటి నుంచి యూత్ లేటెస్ట్ క్రష్ అయిపోయింది. దీంతో ఈ భామ.. వరుసగా ఆఫర్స్ అందుకుంటూ దూసుకెళ్తున్నట్లు టాక్ వినిపిస్తుంది. ఇక ఈ మధ్య విజయ్ దేవరకొండ సరసన కింగ్ డమ్ మూవీలో కనిపించి మెప్పించింది. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ తన ఫొటోస్ షేర్ చేస్తూ కుర్రకారును మాయ చేస్తుంటుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు తాజాగా ఇన్‌స్టాలో పిక్స్‌పెట్టింది. 'డియర్ జిందగీ, 2025కి థాంక్యూ.. ఈ ఏడాదిలో చాలా నేర్చుకున్న. లవ్, నవ్వుతో నా మనస్సు నిండిపోయింది. అన్నిటికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మిస్టర్ 2026.. కొత్త ఏడాదిలో అందరికీ మంచిగా ఉండాలి. నాకు ఒక మాట ఇవ్వు. లైఫ్‌లో ఎప్పటికీ నమ్మకం కోల్పోకూడదు. మనసులోని పిల్లాడిని ఎప్పటికీ బ్రతికించి ఉంచాలి. ఓటమిని చూసి నవ్వగలగాలి. ప్రతి తప్పును చిరునవ్వుతో స్వీకరించాలి. జీవితం అన్నది అన్నీ సరిగ్గా చేయడమే కాదు, చెప్పుకోదగ్గ ఒక అందమైన కథను సృష్టించుకోవడమే' అంటూ పోస్ట్ చేసింది.



## ఎర్రకోక పచ్చ రైక

చిన్నతనంలోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కావ్య కల్యాణ్ రామ్.. చాలా మంది స్టార్ హీరోల సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించి ఆకట్టుకుంది. పెద్దయ్యాక హీరోయిన్‌గా మారి తన లక్ ను టెస్ట్ చేసుకుంటుంది. 'మసూద'తో తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత బలగం చిత్రంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు మారుమ్రోగింది. దాంతో కావ్య చాలా మంది ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది. ఆతర్వాత శ్రీ సింహ నటించిన ఉస్తాద్ సినిమా డిజాస్టర్ అయ్యింది. అయితే కొద్దిరోజులుగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ అమ్మడు.. సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. రెగ్యులర్‌గా ఫొటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. ఎర్ర చీర, ఆకుపచ్చ బ్లౌజ్‌తో ఎలాంటి హంగూ ఆర్భాటాలూ లేకుండా చాలా నేచురల్ లుక్ లో కనిపించి అందరినీ అట్రాక్ట్ చేస్తోంది. ఈఫొటోలకు 'నా సాయంత్రం ఫిల్టర్ కాఫీ కోసం సిద్ధం' అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఇక కావ్య షేర్ చేసిన ఈ ఫొటోలకు నెటిజన్లు లైకులు కొడుతూ.. నెట్టింట తెగ వైరల్ చేస్తున్నారు.



## ఫ్యాన్స్ నిరాశ

సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటించిన సికందర్ బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం విఫలమవ్వడం నిజంగా అతడిని నిరాశపరిచింది. ఆ నిరాశ నుంచి బయటపడేసే భారీ హిట్టు కోసం తపిస్తున్న సల్మాన్ బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ చిత్రంతో గ్రేట్ కంబ్యాక్ ని ఆశిస్తున్నాడు. అపూర్వ లఖియా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, సాహసోపేతమైన ఇండో-చైనా బార్డర్ వార్ నేపథ్యంలో ఇది రూపొందుతోంది. ఈ సినిమా టీజర్ ఇటీవలే విడుదలైంది. అందులో సల్మాన్ ఒక నిరాయుధుడై శత్రు సైన్యంపై పోరాడటానికి సిద్ధమయ్యే సీన్ చూపించారు. కానీ అందులోని కంటెంట్ అభిమానులను అంతగా మెప్పించలేకపోయింది. చైనా సైన్యం ఆయుధాలు లేకపోయినా ముష్టి యుద్ధానికి అన్ని రకాల రక్షణలతో దూసుకొస్తుంటే.. సల్మాన్ మాత్రం చాలా సింపుల్ గా ఒక పుచ్చిపోయిన కర్ర పట్టుకుని నిలబడ్డాడు. ప్రతిఘటించేందుకు సిద్ధంగా లేనివాడిగా కనిపించాడు. ఇది ఫ్యాన్స్ ని నిరాశపరిచింది. దీంతో ట్రోలింగ్, మీమ్స్ తో విరుచుకుపడుతున్నారు.



## 'కానిస్టేబుల్ కనకం' సీజన్ 2 స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్.. సబ్‌స్క్రిప్షన్‌పై 'ఈటీవీ విన్' ఆఫర్



'ఈటీవీ విన్' ఒరిజినల్ వెబ్‌సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' ఆగస్టులో విడుదలై, ప్రేక్షకులను విశేషంగా అలరించింది. దీంతో, ఈ సిరీస్ సీజన్ 2పై ఆసక్తి నెలకొంది. 'కానిస్టేబుల్ కనకం 2' ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూసిన వారికి ఓటీటీ సంస్థ శుభవార్త చెప్పింది. స్ట్రీమింగ్ డేట్‌ను ఖరారు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపింది. 2026 జనవరి 8 నుంచి ఈ సిరీస్ సీజన్ 2 స్ట్రీమింగ్ అవుతుందని ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ ఆఫర్ కూడా ఇచ్చింది.

**సిరీస్ కథాంశమిదీ..**

వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ దిమ్మెల తెరకెక్కించిన సిరీస్ 'కానిస్టేబుల్ కనకం'. కనక మహాలక్ష్మి అలియాస్ కనకం పాత్రలో వర్ష ఆకట్టుకున్నారు. కానిస్టేబుల్‌గా పని చేసేందుకు కనకం ఓ ఊరికి వెళుతున్న సమయంలో ఆమెకు చంద్రిక (మేఘ లేఖ) పరిచయం అవుతుంది. ఇద్దరూ స్నేహితులవుతారు. ఒక రోజు కనకం, చంద్రిక కలిసి బండిపై వెళుతుండగా ప్రమాదం జరుగుతుంది. ఆ క్షణం నుంచి చంద్రిక కన్పించకుండా పోతుంది. ఇంతకీ చంద్రిక ఏమైంది? అడవిగుట్టలో దాగిన మర్మం ఏంటి? అక్కడకు వెళ్లిన మహిళలు ఏమవుతున్నారు? కానిస్టేబుల్ కనకం ఈ మిస్టరీని ఎలా ఛేదించింది? అన్నది సిరీస్ కథాంశం. చంద్రిక ఎక్కడుంది అన్నది సీజన్ 2లో కీలకం.

**సబ్‌స్క్రిప్షన్ ఆఫర్**

'ఈటీవీ విన్' నెలవారీ సబ్‌స్క్రిప్షన్ తీసుకునే వారు 'WIN50' కోడ్ ఉపయోగించి ₹ 50 రాయితీ పొందవచ్చని, 'WIN100' కోడ్ ఉపయోగించి వార్షిక చందాదారులు రూ.100 రాయితీ పొందవచ్చని సంస్థ ప్రకటించింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.